
స్థిత ప్రజ్ఞుడు

# స్థితప్రజ్ఞుడు



డా॥ కె. రామారావు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

స్థిత ప్రజ్ఞుడు

రెండవ ముద్రణ : జూన్, 2005

స్పాన్సర్డ్ బై

**విమల**

వెల : రూ|| 8/-

నా గురుదేవులు

# శ్రీ నాన్నగారి

బోధామృత సారమును మీరు

ఆస్వాదించి, ఆచరించి, తరించి

సుఖించాలనే ఆశతో ఈ గ్రంథము

మీకే అంకితము.



ఉన్నత శిఖరములను అధిరోహించుటకు

ప్రయత్నించు మానవులకు భగవద్గీత చేసిన

ఉపదేశము అద్వితీయమైనది

\- వార్న్‌హేస్టింగ్స్

# ముందుమాట

సుమారు ఐదువేల సంవత్సరములకు పూర్వము కురుక్షేత్రములో కౌరవులకు పాండవులకు యుద్ధము జరుగబోయే ముందు బంధుమిత్రుల మారణ హోమాన్ని ఊహించుకొని శోకించు అర్జునుడిని కార్యోన్ముఖుడిని గావించుటకు శ్రీ కృష్ణ పరమాత్మ బోధించిన బోధామృతమే భగవద్గీత. పరమాత్మ శ్రీ కృష్ణుడిగా దీనిని చెప్పలేదు - భగవంతుడై చెప్పాడు. అందుకే ఇది కృష్ణగీత కాదు - భగవద్గీత.

భగవద్గీత ఒక కులానికో, మతానికో, దేశానికో సంబంధించిన గ్రంథము కాదు - విశ్వ గ్రంథము. హిందువులైనా, క్రైస్తవులైనా, మహమ్మదీయులైనా దీనిని చదివితే పుణ్యము వస్తుంది. చదివి, అర్థము చేసుకొని ఆచరిస్తే జ్ఞానము వస్తుంది. భగవద్గీత వేరు భగవంతుడు వేరు కాదు. భగవద్గీతలోని మాటలను మనము గౌరవిస్తే అది భగవంతుడిని గౌరవించినట్లే! భగవద్గీతలోని మాటలను మనము అర్థము చేసుకుంటే - భగవంతుడిని అర్థము చేసుకున్నట్లే! పుస్తకము చిన్నదైనా దీనికీర్తి చాలా గొప్పది. అన్ని

గ్రంథములకు ఇది రాజు.

"కాశీలోని గంగను కొంచెము సేవించినా, విష్ణు సహస్రనామములను కొంచెము పారాయణము చేసినా, భగవద్గీతను అంతా పారాయణము చేయలేక పోయినా కనీసము ఒక్క శ్లోకమును పారాయణము చేసినా మీ జీవితాలు తరిస్తాయి" అని శ్రీ ఆదిశంకరాచార్యులవారు చెప్పారు.

ఈ భగవద్గీత కంటే ముందు అనేక ప్రాచీన గ్రంథములున్నవి. కాని భగవద్గీతకు మాత్రమే ఇంతటి కీర్తి వచ్చుటకు కారణము గీతలో మంత్రముంది - తంత్రముంది. మంత్రమంటే ఉపాసన (భక్తి) మార్గము - తంత్రమంటే కర్మ మార్గము. మంత్రమంటే థీరిటికల్ - తంత్రమంటే ప్రాక్టికల్! ప్రాచీన గ్రంథములలో ప్రాక్టికల్ కంటే థీరియే ఎక్కువగా వర్ణించబడినది.

భగవద్గీతలో మొదటి ఆరు అధ్యాయములు కర్మ గురించి, మధ్య ఆరు అధ్యాయములు భక్తి గురించి, చివరి ఆరు అధ్యాయములు జ్ఞానము గురించి చెప్పబడినది. కర్మ మార్గాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే - భగవంతునిపట్ల భక్తి కలుగుతుంది. ఆ భక్తి జ్ఞానమనే చిటారు కొమ్మకు తీసుకుపోతుంది.

భగవద్గీతకు ఎందరో మహాత్ములు వ్యాఖ్యానాలు వ్రాశారు. ఆదిశంకరులు జ్ఞానపరంగాను, రామానుజుల వారు భక్తిపరంగాను, తిలక్ మహాశయుడు కర్మపరంగాను, గాంధీ మహాత్ముడు అనాసక్తి పరంగాను - ఇలా ఎందరో మహాత్ములు వ్రాశారు. "గీతకు వ్యాఖ్యానమంటే వ్రాశానేగాని దాని లోతు నాకు తెలియలేదు" అన్నారు తిలక్ మహాశయుడు.

మనలో జీవలక్షణాలు ఉన్నంతకాలము మనము గీతను ఎన్నిసార్లు చదివినా అది మన సంస్కారములకు అనుగుణముగానే అర్థమౌతుంది గాని - గీతాహృదయమును అర్థము చేసుకొనుట అసాధ్యము. స్వచ్ఛమైన బుద్ధికి మాత్రమే గీతా సందేశము అందుతుంది. గీత లోతును ఒక జ్ఞాని మాత్రమే చూడగలడు. మన అజ్ఞానమే మనకు నిజము తెలియకుండా అడ్డుపడుచున్నది.

మన అందరికీ తెలివితేటలు ఉన్నాయని అనుకుంటున్నాము. నిజమే! మరి మనకున్న తెలివితేటలే గనుక నిజమైతే మనకు జ్ఞానము ఎందుకు కలుగుట లేదు? నిజము ఎందుకు తెలియుటలేదు? మనకు

ఎన్ని తెలివితేటలు ఉన్నా, ఎన్ని శాస్త్రములు చదివినా అవి ఈ లోకానికే పరిమితము, ఈ పొట్టకే పరిమితము. చదువులలోని సారము కాదది. చదువులలోని సారము సత్యము. సత్యము తెలియని జన్మ వ్యర్థము.

సముద్ర గర్భములో కలియుటకు అడ్డు వచ్చు కొండలను సైతము పగులగొట్టుకుంటూ ప్రవహించు నదీ ప్రవాహమువలే ఎవడి హృదయములో నుంచి సత్యాన్ని తెలుసుకోవాలనే కాంక్ష, జ్ఞానాన్ని పొందాలనే తపన వస్తుందో - వాడికి మాత్రమే సత్యము తెలియ బడుతుంది. జ్ఞానమనే పండు వాడిచేతికి అందుతుంది.

మన ఆలోచనలే, మన అభిరుచులే, మన సంస్కారాలే మనకు నిజము తెలియకుండా అడ్డు పడుచున్నవి. మనమందరము జీవులము - భగవంతుని బిడ్డలము. మనల్ని తరింపజేయాలని మన మీద ప్రేమతో మన హితవుకోరి భగవంతుడు ఈ గీత శాస్త్రాన్ని మనకు ప్రసాదించాడు.

"స్థిత ప్రజ్ఞుడు ఎలా ఉంటాడు? అతని ప్రవర్తన ఎలా వుంటుంది? అతని మాటలు ఎలా వుంటాయి? అతని మనస్సు ఎంత విశాలముగా వుంటుంది? అతని

మనస్సులో ఎటువంటి వృత్తులు వుంటాయి? నిత్య జీవితములో అతని నడవడిక ఎలా వుంటుంది? వాడు జ్ఞాని, వాడు గుణాతీతుడు, వాడు ప్రకృతిని దాటిన వాడు, వాడు స్థిత ప్రజ్ఞుడు అని ఎలా తెలుస్తుంది?" అని కృష్ణ పరమాత్మను అర్జునుడు ప్రశ్నించగా స్థితప్రజ్ఞ లక్షణాలను భగవంతుడు ఇలా వివరిస్తున్నాడు....



# స్థిత ప్రజ్ఞుడు

"ఓ అర్జునా! తన మనస్సులో పుట్టే సంకల్పాల నన్నింటినీ నిశ్శేషముగా విడిచిపెట్టి ఆత్మలోని ఆనందాన్ని అనుభవిస్తూ, శాంతిని పొందుతూ, సమాధి స్థితిలో స్థిరముగా ఎవడు ఉండగలుగుతున్నాడో - వాడు మాత్రమే స్థితప్రజ్ఞుడు" - జీవన్ముక్తుడు.

"ప్రాపంచిక విషయాలను అనుభవించాలనే కాంక్షను కామమంటారు. మనిషికి కాంక్ష వున్నంత కాలము ప్రకృతి ప్రలోభములకు వాడు లొంగిపోతూనే వుంటాడు. తన సుఖంకోసం, శాంతికోసం, ఆనందం కోసం ఈ ప్రకృతి మీద ఆధారపడక - ఆత్మను తన స్వరూపముగా దర్శించినవాడు మాత్రమే ప్రకృతి ప్రలోభములను దాటగలడు. వాడి బుద్ధి మాత్రమే ఆత్మలో స్థిరముగా వుంటుంది" - వాడే జ్ఞాని!

"నిజమైన సుఖము, శాంతి, ఆనందము ఎక్కడ వుందో తెలియనంత కాలము మానవుడు తనకు లేని దానిలో సుఖము వుందని భ్రాంతి పడుతుంటాడు - ప్రాపంచిక వాంఛలకు లొంగి పోతుంటాడు - ఒక గోతిలో నుంచి లేచి మరో గోతిలో పడుతూనే ఉంటాడు."

"ఆత్మలో తప్ప ఈ సృష్టిలో సుఖము ఎక్కడా

లేదు. ఉన్నది ఆత్మ ఒక్కటే! మిగిలినవన్నీ ఉన్నవాని వలే కనిపిస్తున్నాయేగాని - అవి నిజముకాదు. ఆత్మకు అన్యముగా అవిలేవు. ఈ సృష్టికంతటికి ఆత్మే ఆధారము"

ఆత్మ సత్-చిత్ఆనంద స్వరూపము. అది అనంతము, అఖండము, అమరము, అజరము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము, అనిర్వచనీయము. అద్వితీయము. దానిని శస్త్రములు ఛేదించలేవు. నీరు తడుపలేదు. నిప్పు కాల్చలేదు, గాలి కదుపలేదు. దానికి ఆదీలేదు - అంతమూ లేదు. పుట్టుకాలేదు - మరణమూ లేదు. అది ఎక్కడో దూరాన లేదు - మన స్వరూపముగానే ఉంది! మన హృదయములో ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది. మనము ఆత్మ స్వరూపులమన్న సంగతి మరచిపోయాము - పుట్టి పెరిగి గిట్టే ఈ దేహమే మనమనుకొని ప్రకృతిని చూసి భ్రమ పడుతున్నాము - దుఃఖానికి లోనౌతున్నాము.

మన భ్రాంతికి కారణం - 'నేను' అను దేహ పరిమిత బుద్ధే! ఆత్మ చైతన్యము - దేహము జడము. ఈ రెండింటిని కలిపి ముడిపెడుతూ మధ్యన దేహ పరిమితమైన "నేను" ఒకటి పుట్టుచున్నది - అదే ఛిజ్జడ గ్రంథి! దానినే అహంకారమని, అజ్ఞానమని, జీవుడని

అంటారు. మనకు వచ్చే తలంపులలో ఈ "నేను" అనునది ప్రథమ తలంపు, ప్రధాన తలంపు, పునాది తలంపు. ఈ నేనను తలంపును ఆధారము చేసుకొనే మిగిలిన అన్ని తలంపులు వచ్చుచున్నవి - ఆ తలంపుల మూటే మనస్సు! మనస్సే ప్రపంచముగా వ్యక్తమగు చున్నది.

ప్రతీ మనిషి "నేను, నేను" అని తన గుండెల మీద కుడి వైపున క్రింది భాగములో చేయివేసి చూపిస్తుంటాడు. అంటే ఆ నేనుకు మూలము మన లోపల అక్కడనే ఉన్నది - అదే ఆధ్యాత్మిక హృదయము! ఆ హృదయములో బ్రహ్మము నిరంతరము "నేను నేను" అని స్వయముగా ఆత్మ రూపమున ప్రకాశిస్తున్నది. నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు - ఆత్మ గతమైన ఆ "నేను"లో నుంచే దేహపరిమితమైన ఈ మిధ్యానేను పుట్టుచున్నది. కాని అది తన మూలమును మరచి పోయి, స్వయంభువుడననుకొని స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది.

"నేను" ఆత్మ - నేనను తలంపు అహంకారము. ఆత్మ అనంతమైనది - అహంకారము దేహపరిమిత మైనది. ఆత్మ సముద్రమువంటిది - అహంకారము

సముద్రము నుంచి ఉద్భవించిన ఒక నీటి బుడగ వంటిది మాత్రమే! బుడగ లేకుండా సముద్రము ఉండ గలదు - కాని సముద్రము లేకుండా బుడగ ఉండలేదు. అదే విధముగా అహంకారము లేకుండా ఆత్మ ఉండ గలదు - కాని ఆత్మ లేకుండా అహంకారము ఉండలేదు. అహంకారానికి దేహం కావాలి, లోకం కావాలి, దేవుడు కావాలి - కాని దేహం లేకుండా లోకం లేకుండా, దేవుడు లేకుండా ఆత్మ ఉండగలదు. అది స్వయం ప్రకాశము.

అహంకారము పుట్టినప్పడే జీవుడు పుట్టాడు. మరల అహంకారము మరణించినప్పడే జీవుడు మరణిస్తాడు. దేహము మరణించినా అహంకారము మరణించదు. కట్టెలలో దేహము కాలిపోయినప్పడు అహంకారము కట్టెలలో కాలిపోదు. తన మూలములో కలిసిపోయేవరకు అహంకారానికి చావులేదు. జ్ఞానాగ్ని ఒక్కటి మాత్రమే దానిని దహించగలదు.

"తాను దేహము లోపలవున్నానని - తనకు బాహ్యంగా లోకముందని - దేవుడు ఎక్కడో దూరాన వున్నాడని" మానవుడు భ్రాంతిపడుతున్నంతకాలము ప్రకృతిని చూసి వాడు ఆశపడుతూనే వుంటాడు -

దేవుడిని ఏదో కోరుతూనే వుంటాడు. ఆశ వున్న మనిషి ఫలితాన్ని ఆశించకుండా పనిచేయలేడు. ఫలితాన్ని ఆశించి పనిచేసినంతకాలము ఆ పనిలో నుంచి సంస్కారము ఏర్పడుతుంది. ఆ సంస్కారము బీజ రూపమున హృదయములో దాగివుండి మరుజన్మకు హేతువౌతుంది. దేహము రాలిపోయినా, కర్మేంద్రియా లు కాలిపోయినా ఆ సంస్కారము మాత్రము రాలదు - అది కాలదు. దేహాలు మారినా, పరిసరాలు మారినా హృదయములోని సంస్కారము మాత్రము మారదు. మరుజన్మలో మరల ఆ సంస్కారములో నుంచి కోరిక పుడుతుంది. ఆ కోరిక వాడిచేత పనిచేయిస్తుంది. ఆ పనిలో నుంచి ఫలితము పుడుతుంది. ఆ ఫలితాన్ని వాడు అనుభవిస్తాడు. ఆ అనుభవములోనుంచి మరల సంస్కారము పుడుతుంది. ఆ జన్మకాజన్మ ఆ సంస్కారము మరింత బలపడుతుంది. ఇది కర్మ సముద్రము. కర్తృత్వ బుద్ధి ఉన్నంతకాలము మానవుడు ఈ కర్మ సముద్రాన్ని దాటలేడు - జనన మరణ చక్రము లోనుంచి బయటపడలేడు. ఇది ఈశ్వరచట్టం - కాదనలేని సత్యం.

హృదయములోనున్న సంస్కారములు

నిశ్శేషముగా బయటికి పోకుండా ఏ జీవుడూ జ్ఞాని కాలేడు. జ్ఞానికానివాడు దేవునిలో లయముకాలేడు. హృదయములో ఒక్క సంస్కారము మిగిలినప్పటికీ అది మరుజన్మకు హేతువౌతుంది. జన్మించిన ప్రతీవాడిని దుఃఖము వెంటాడితీరుతుంది. ఆత్మస్థితిని అందుకునే వరకు దుఃఖము ఎవరినీ విడిచిపెట్టదు. దుఃఖములో నుంచి బయటపడాలంటే సాధన చేసితీరాలి.

గాఢనిద్రలో మనకు ఏ తలంపూ లేదు. తలంపు లేనప్పుడు మనకు కామంలేదు, క్రోధంలేదు, రాగంలేదు, ద్వేషంలేదు, దుఃఖంలేదు. ఇది మన అనుభవం! దీనికి లింగముతో గాని, కులముతోగాని, మతముతోగాని సంబంధములేదు. మరల గాఢనిద్ర లో నుంచి మెలుకువ రాగానే "నేను" అను తలంపు వస్తున్నది. దాని వెనకాలే సైన్యము వచ్చినట్లు మన రాగాలు, ద్వేషాలు అన్నీ గుర్తుకువస్తున్నాయి. వాడు గృహస్థు అయినా, సన్యాసి అయినా - అహంకార మమ కారములు ఉన్నంతకాలము తలంపులను ఎవ్వరూ నిగ్ర హించలేరు. అహంకారముతో ఎన్ని సాధనలు చేసినా అవన్నీ ఒకటిలేని సున్నలే! గానుగెద్దు అనుకుంటుందట ప్రొద్దుట నుంచి ఎంతో దూరము నడిచానని - తీరా

గంతలు విప్పాక ఎక్కడ వున్నది అక్కడనే ఉంటుంది. అహంకారముతో చేసే సాధనలు కూడ అలాగే వుంటాయి.

మనందరికీ భక్తి ఉంది. కాని అందులో మినహాయింపులు ఉన్నాయి. అహంకారాన్ని అట్టి పెట్టుకొని దానికి మోక్షాన్ని కట్టబెట్టాలని మన ఆశ! అహంకారము ఉన్నంతకాలము మోక్షము సాధ్యము కాదు. కారణ భక్తి కూడా భక్తే! దానికి ఫలితము లేదని కాదు. కారణ భక్తి వల్ల పుణ్యము వస్తుంది. పుణ్యము చేసి కైలాసానికో, వైకుంఠానికో వెళ్ళవచ్చును. కాని అక్కడ సాధన చేసి సిద్ధినిపొందే అవకాశము లేదు. పుణ్యఫలము ఖర్చైన వెంటనే తిరిగి భూమి మీదకు రావలసినదే! అహంకారములో నుంచి బయట పడాలంటే అకారణభక్తిని ఆచరించి తీరాలి. భగవంతునిపట్ల మనకు పరిపూర్ణమైన ప్రేమ ఉండాలి - ఆ ప్రేమకు కారణము కనిపించకూడదు. అదీ అకారణ భక్తి! అకారణభక్తిని ఆచరించకుండా మానవుడు అహంకారములో నుంచి బయటపడలేడు. అహంకారములో నుంచి బయటపడనివాడికి ముక్తి లేదు - మోక్షము లేదు.

జన్మించిన ప్రతీ జీవుడు కట్రాడకు కట్టివేయ బడిన పశువులాంటివాడే! "దేహమే తాను" అను భావనే కట్రాడ. ఆ కట్రాడకు కట్టి కర్మ అనే కర్రతో మోదుతున్నాడు భగవంతుడు. అహంకారములో నుంచి బయటపడకుండా ఈ కర్మ సముద్రాన్ని ఎవ్వడూ దాటలేడు. అహంకారము ఉన్నంతకాలము దేవుడు తనకంటే వేరుగా ఉన్నాడనిపిస్తుంది. వేరు భావన ఉన్నంతకాలము - లోకాన్ని చూసి భ్రాంతి పడు తూనే ఉంటాడు - దేవుడిని ఏవో కోరికలు కోరుతూనే ఉంటాడు. అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవించే వాడికి ధ్యానము కుదరదు. బాహ్యేంద్రియ నిగ్రహము, అంతరేంద్రియ నిగ్రహము లేనివాడు ధ్యానము చేయ లేడు. ఎవడైతే యమ, నియమ, ఆసన, ప్రాణామయ, ప్రత్యాహార, ధారణ క్రమాన్ని ఆచరిస్తూ నిరంతరము ఈశ్వర పాదాలనే ధ్యానిస్తాడో - వాడు మాత్రమే అహం కారములో నుంచి బయటపడతాడు - వాడికి సమాధి స్థితి కలుగుతుంది. ఆత్మ స్థితిని పొందేవరకు అహంకారము విడిచిపెట్టదు. ఈ లోకములో నుండగా, ఈ దేహములో నుండగానే సాధన చేసి దేహబుద్ధిలో నుంచి బయటపడాలి. దేహబుద్ధి

వున్నంత కాలము జీవుడు దేవుడు కాలేడు.

అందరికీ దేహమంటే అభిమానము ఉంది. కాబట్టే మరణమంటే భయము వేస్తున్నది. దేహము మీద మమకారము లేనివాడికి మరణము వచ్చి మీద పడినా భయము వేయదు. దేహమే తానని జీవుడు ఎంత సహజముగా అనుకుంటున్నాడో - అంతే సహజముగా ఆత్మే తానని తెలుసుకున్నవాడు మాత్రమే మృత్యువును దాటిపోతాడు - అది వాడికి కడసారి జన్మ!

జన్మించిన తరువాత మరణించేలోపులో మనకు శుభాలు రావచ్చును - అశుభాలు రావచ్చును. మంచి జరిగితే శుభమంటారు - చెడు జరిగితే అశుభమంటారు. వాటి మీద మన దృష్టి పెట్టకూడదు. మనిషి వెంట నీడలాగ పూర్వజన్మలలో మనము చేసిన కర్మ వెంటాడుతుంది. మనము ఏ తల్లి కడుపులో పుట్టాలో, ఏ గ్రామములో జీవించాలో, ఏ రోజున మరణించాలో, జీవితములో కష్టాలే రావాలో - సుఖాలే రావాలో, అదృష్టమేరావాలో - దురదృష్టమే రావాలో మన ప్రారబ్ధాన్ని బట్టి జరుగుతుంటుంది. మన కోరిక తోటి, ప్రయత్నముతోటి సంబంధము లేకుండా పగలు తరువాత రాత్రి - రాత్రి తరువాత పగలు ఎలా తిరుగు తున్నాయో

- మన దేహ ప్రారబ్ధాన్ని అనుసరించి శుభాశుభాలు వస్తూపోతూ వుంటాయి. అదృష్టము వస్తే పొంగిపోకూడదు - దురదృష్టము వస్తే కృంగిపోకూడదు. అదృష్టము వచ్చినా దురదృష్టము వచ్చినా కలకాలము కాపురముండవు. అవి శాశ్వతము కాదు - స్వప్నతుల్యము. దేహ ప్రారబ్ధమును అనుసరించి పరిస్థితులు ప్రతికూలించినప్పటికీ దుఃఖపడక ప్రశాంతముగా భరించాలి. ఒకవేళ ప్రారబ్ధమును అనుసరించి సుఖమురావచ్చును. దానిమీద కూడ ఆశక్తి ఉండకూడదు. ఆసక్తి వుంటే మనస్సు ఆత్మవైపు తిరగక మరల మరల ఆ సుఖాన్నే కోరుకుంటుంది - లక్ష్యాన్ని మరచిపోతుంది - ఇంద్రియాలకు లొంగిపోతుంది.

మానవుడు తనకు మంచి చేయనిదానిని మంచి చేస్తుందని భ్రమపడుతుంటాడు. అదే రాగము! మనకు ఎవరైనా ఉపకారము చేస్తే వారి మీద రాగము - అపకారము చేస్తే ద్వేషము పుడుతుంది. ఈ దేహములో ప్రాణముండగానే ఎవడు రాగద్వేషాలను దాటిపోతాడో - వాడి ఇంద్రియాలు, వాడి మనస్సు, వాడి వృత్తులు నదులన్నీ సముద్రములో కలిసిపోయినట్లు ఆత్మలో కలిసిపోతాయి - వాడు మృత్యువును

దాటి పోతాడు - అమృతస్థితిని అందుకుంటాడు - జ్ఞానములో స్థిరముగా ఉండిపోతాడు - సుఖశాంతులు వాడి సొంతమౌతాయి.

ప్రతీ జీవుడు ఇంద్రియాలకు లొంగిపోయి, రాగ ద్వేషాలతో కాలిపోతున్నాడు. రాగము వేరు - ప్రేమ వేరు. రాగము కోరుతుంది - ప్రేమ త్యాగము చేస్తుంది. రాగము అశాంతిని తీసుకువస్తుంది - ప్రేమ శాంతిని తీసుకువస్తుంది. రాగము బంధిస్తుంది - ప్రేమ బంధము లో నుంచి విడుదల చేస్తుంది. రాగము ప్రకృతికి సంబంధించినది - ప్రేమ ఆత్మకు సంబంధించినది. రాగద్వేషాలు లేకుండా - స్వాధీనమైన మనస్సుతో, స్వాధీనమైన ఇంద్రియాలతో విషయాలను అనుభవించే వాడు యుక్తుడు. వాడిని విషయాలు బంధించవు. వాడి బుద్ధి నిర్మలమౌతుంది. వాడికి సర్వదుఃఖాలు నశిస్తాయి - శాంతి సొంతమౌతుంది - యోగము సిద్ధిస్తుంది. మనస్సు స్వాధీనములో లేనివాడు అయుక్తుడు. అయుక్తుడికి ఇంద్రియ నిగ్రహము సాధ్యము కాదు. అయుక్తుడు ఆత్మను తెలుసుకోవాలని అనుకున్నప్పటికీ విషయాల వెంట వాడి ఇంద్రియాలు పరుగెడుతున్నంత కాలము వాడికి ఆత్మ తెలియదు. వాడి బుద్ధి

హరించబడుతుంది. నీటిలో పయనించు పడవను ప్రతికూల వాయువు పెడదారికి లాగుకొని పోవునట్లు - విషయ చింతన వాడి మనస్సును ప్రకృతి వైపు లాగివేసి ఆత్మబుద్ధి కలుగకుండా గతిని నిరోధిస్తుంది.

ధర్మ అర్థ కామ మోక్షాలను పురుషార్థాలని అంటారు. సర్వసాధారణంగా మొదటిదీ, చివరిదీ ఎవరికీ ఇష్టముండదు. మధ్యన ఉన్న అర్థకామాలంటే అందరికీ ఇష్టమే. కాని నిజమైన పురుషార్థము, ప్రధాన పురుషార్థము మోక్షము ఒక్కటే! మోక్షమంటే అహంకారములో నుంచి విడుదల పొందుట. మోక్షము పొందని జన్మ వ్యర్థము. మోక్షము పొందాలంటే - ఈ సృష్టిలో కనిపించే వస్తువుల పట్లగాని, వ్యక్తుల పట్లగాని పరిసరాల పట్లగాని, చివరికి మన శరీరము పట్లగాని, ఇష్టాయిష్టములు పెట్టుకోకూడదు - ఆసక్తి పెట్టుకోకూడదు - అభిమానము పెట్టుకోకూడదు. ఆధ్యాత్మికంగా మనము ఎంతవరకు అభివృద్ధి చెందుతున్నామో, ఎంత వరకు ఆత్మ వైపు ప్రయాణము చేయగలుగుతున్నామో, ఎంత వరకు ఆత్మాకారము చెందగలుగుతున్నామో, దాని మీదనే మన దృష్టిని పెట్టుకోవాలి.

మన కష్టసుఖాలకు ఎవరో బయటివారు కారణం కాదు - మన ఇంద్రియాలే కారణం! జన్మల తరబడి వాటిని పెంచి పోషించుకుంటూ వస్తున్నాము. మనము చేసే సాధనల కంటే వాటి బలము ఎక్కువ. అందుచేత ఇంద్రియాలను నిగ్రహించుట అంత సులభము కాదు. మనము తల్లి గర్భములో నుంచి బయటికి వచ్చినప్పుడే మన ఇంద్రియాలు బహిర్ముఖమై ఉంటాయి. అవి బయటికి ప్రయాణము చేయుటకే అలవాటుపడి ఉన్నాయి. వాటికి విషయాలే సర్వస్వము. మరణించేటప్పుడు కూడ మన మనస్సు ఇంద్రియాల మీదకే పరుగెడుతుంది. ఆత్మవైపు ప్రయాణము చేయ మంటే చేయదు.

కళ్ళు చూస్తున్నాయని అనుకుంటాము, కాని కళ్ళు చూచుటలేదు, కళ్ళ ద్వారా మనస్సు చూస్తున్నది. చెవులు వింటున్నాయనుకుంటాము - కాని చెవులు వినుటలేదు. చెవుల ద్వారా మనస్సు వింటున్నది. భగవంతుడు మంచి మాటలు చెబుతున్నప్పటికీ - మన మనస్సులో గనుక ఆ శుభ సంస్కారము లేకపోతే కొందరు కళ్ళుండీ చూడలేరు - చెవులుండీ వినలేరు. అందుచేత మనస్సు ప్రధానము. దానిని సంస్కరించు

కోవాలి. సద్గ్రంథ పఠనమువలన, సత్పురుష సహవాసము వలన, భగవంతుడిని నిరంతరము స్మరించుట వలన, పుణ్య కార్యములు చేయుట వలన, పొరుగువారి హితవు కోరుట వలన, సమాజాన్ని సేవించుట వలన, మహాత్ముల ను దర్శించి సేవించుట వలన, మనస్సులోని మాలిన్య ము రాలిపోయి మనస్సు స్వచ్ఛమౌతుంది. స్వచ్ఛమైన మనస్సు అంతర్ముఖమై ఆత్మలో అణిగిపోతుంది.

విషయాన్ని అర్థము చేసుకోకుండా మొండి తనముతోటి, మూర్ఖత్వముతోటి, తిండిమాని, నిద్ర మాని, తపస్సులు చేస్తే భ్రష్టులౌతారేగాని అంత మాత్రము చేత యోగము సిద్ధించదు. పూర్వము పురాణములలో ఇల్లు విడిచిపెట్టి, తిండి మానివేసి, ఎక్కడో అరణ్యాలలో తపస్సులు చేసినట్లు మనము చదువుతున్నాము. అయితే అంత మాత్రము చేత వారు ఇంద్రియాలను జయించినట్లుగా చెప్పలేము. కొంత కాలము తిండి తినుట మానివేస్తే, కళ్ళతో చూచుట మానివేస్తే, చెవులతో వినుట మానివేస్తే, ఇంద్రియాలు అలా పడివుండి క్షోభపెట్టకపోవచ్చు, అశాంతి తీసుకు రాకపోవచ్చు - అంత మాత్రము చేత ఇంద్రియాలను జయించినట్లు కాదు. ఎందుచేతనంటే - చావుకు సిద్ధమైనవాడి ఇంద్రియాలు

కూడా కదలవు. అయితే వాడూ ఇంద్రియాలను జయించినట్లేనా? లంకణాలు చేసిన వాడి ఇంద్రియాలు కూడా ఏమీ గొడవ చేయవు. మరి వాడూ ఇంద్రియాలను జయించినట్లేనా? - కాదు! జయించవలసినది మనస్సును! మనస్సుకు స్వస్థత చేకూరనంత కాలము - వాడు ఎంత గొప్ప సాధకుడైనప్పటికీ, ఎంత గొప్ప భక్తుడైనప్పటికీ, మోక్షాన్ని పొందాలనే తపన గలవాడైనప్పటికీ - వాడు ఎంత నిగ్రహించుకుందామని ప్రయత్నించినప్పటికీ, వాడి ఇష్టాయిష్టములతోటి సంబంధము లేకుండానే వాడి ఇంద్రియములు బలవంతముగా వాడి మనస్సును బాహ్య జగత్తులోనికి లాగుకుపోతూనే ఉంటాయి. ఇక మామూలు లౌకికుడి మాట వేరే చెప్పాలా?

తాబేలు తనకు ఏదైనా ఆపద సంభవించినప్పుడు తన ఇంద్రియాలను ఎంత సునాయాసముగా, వేగముగా, తేలికగా, మృదువుగా, నేర్పుగా, లోపలికి తీసుకుంటుందో - అదే విధముగా ఏ సాధకుడైతే తన ఇంద్రియాలను విషయాలలో చిక్కుకోకుండా నిగ్రహించుకోగలుగుతున్నాడో - అట్టి వాడి బుద్ధి, వాడి తెలివి, వాడి ప్రజ్ఞ మాత్రమే నిలకడగా వుంటుంది.

"అయితే ఏ జన్మకాజన్మ మంచి పనులో- చెడ్డ పనులో చేస్తూనే ఉంటాము. వాటినన్నింటినీ మూట కట్టి మనసులో పెట్టి మరుజన్మలో అనుభవింపచేస్తూ వుంటే మాకు స్వేచ్ఛ లేదు కదా? మరి ఇలా కాలి పోవలసిందేనా? ఈ కర్మ చక్రములో నుంచి బయట పడే అవకాశమే లేదా? తరించే మార్గమే లేదా?" - అంటే ఉంది!

తల్లి గర్భములో నుంచి జీవుడు బయటికి రాగానే వాడి ఇంద్రియాలను, వాడి మనస్సును, వాడి బుద్ధిని మోహము వచ్చి ఆక్రమించుకుంటున్నది. వాడు ఏ పని చేసినా మోహము యొక్క ప్రేరణతోనే చేస్తున్నాడు. మోహము యొక్క ప్రేరణతో ఎంత గొప్ప పనులు చేసినప్పటికీ వాడికి గొప్పలు రావచ్చును, పుణ్యము రావచ్చును. గుడులు కట్టినా, గోపురాలు కట్టినా, కోటి కొబ్బరి కాయలు కొట్టినా వాడికి మోక్షము మాత్రము రాదు. ఎవడైతే భగవంతుడినే లక్ష్యంగా పెట్టుకొని, భగవంతుని ప్రేమ కోసమే జీవిస్తున్నాడో - వాడి ఇంద్రియాలను, వాడి మనస్సును, వాడి బుద్ధిని మోహములోనుంచి భగవంతుడు విడుదల చేస్తాడు. అప్పుడు వాడి ఇంద్రియాలు చల్లబడతాయి - మనస్సు

నిర్మలమౌతుంది - బుద్ధి శుద్ధి అవుతుంది - సత్యము గోచరిస్తుంది.

జీవుడు, జగత్తు, దేవుడు - ఈ మూడింటి మీదనే ఈ సృష్టి అంతా ఆధారపడి యున్నది. ఎవడైతే దేహాన్ని ధరించాడో - వాడు జీవుడు. వాడి కళ్లకు కనిపించేది జగత్తు! ఈ జగత్తును చూసి, జీవుడు భ్రాంతి పడి - వాడు మనస్సుతో ఊహించుకున్న ఊహల్ని, పెంచుకున్న కాంక్షల్ని, ఇంద్రియాలతో చేసిన చేతల్ని మూటగట్టి హృదయములో జాగ్రత్తపెట్టి భవిష్యత్తు జన్మలలో అనుభవింపజేసేవాడే దేవుడు!

"మనిషి దేనిని ధ్యానిస్తే - దానిపట్లనే వాడికి ఆసక్తి కలుగుతుంది. భగవంతుడిని ధ్యానిస్తే భగవంతుని పట్ల, గురువును ధ్యానిస్తే గురువు పట్ల, లోక విషయాలను ధ్యానిస్తే లోకం పట్ల ఆసక్తి కలుగుతుంది. నిజానికి ప్రతీ మనిషి లోక విషయాలనే ధ్యానిస్తున్నాడుగాని - భగవంతుడిని ధ్యానించుట లేదు. అక్కడ నుంచి వాడి పతనము ప్రారంభమగుచున్నది. చేజారి క్రిందపడిన బంతి ఎంత దూరము దొర్లిపోతుందో చెప్పలేము!

"దేనిని ధ్యానిస్తే దానిపట్లే ఆసక్తి కలుగుతుంది. ఆ ఆసక్తిలో నుంచి ఆశ పుడుతుంది - పొందాలనే కాంక్ష

పుడుతుంది. ఈ ఆశకు అంతులేదు. తనకంటే వేరుగా ఈ లోకము కనిపిస్తున్నంత కాలము ఆశ ఎవడినీ విడిచిపెట్టదు. తన ఆశకు ఎవరైనా అడ్డు పడితే కోపము వస్తుంది. ఆ కోపములో నుంచి మోహము పుడుతుంది. మోహమున్న మనిషికి వివేకము నశిస్తుంది - బుద్ధి నాశనమౌతుంది - మనస్సు మలినమౌతుంది. వాడికి ఏది యుక్తమో - ఏది ఆచరించకూడదో తెలియదు. వాడి బుద్ధికి నిజము అబద్ధముగా - అబద్ధము నిజముగా, సత్యము అసత్యముగా - అసత్యము సత్యముగా కనిపిస్తుంది. లేని లోకము ఉన్నట్లు - ఉన్న దేవుడు లేనట్లు అనిపిస్తుంది. వివేకము లేని బుద్ధి హీనుడు చివరికి సర్వనాశనమైపోతాడు. దేహబుద్ధి వాడిని విడిచి పెట్టదు. బ్రాహ్మీస్థితి వాడి ఊహకు అందదు. వాడు చీకటి లోకాల్లో, అధోలోకాల్లో శాశ్వతం గా పడి వుండ వలసినదే.

"అహంకార మమకారములు లేకుండా సమస్త కోరికలను త్యజించి జీవించువాడికి యోగము సిద్ధిస్తుంది. ఈ దేహములో వుండగానే ఎవడైతే ఆత్మను దర్శించాడో, ఆ పరతత్వాన్ని తెలుసుకున్నాడో - వాడి సమస్త సంస్కారములు హృదయములో కాలి

బూడిద అవుతాయి - బ్రాహ్మీస్థితిని వాడు పొందుతాడు. అదే వాడికి కడసారి జన్మ! అట్టి బ్రాహ్మీస్థితిని పొందిన వాడు మరల మోహము పొందక అంచకాలమందు కూడా ఆ బ్రాహ్మీ స్థితిలోనే స్థిరముగా ఉండిపోతాడు - పరమశాంతిలో కూరుకుపోతాడు - వాడే **స్థితప్రజ్ఞుడు**



# ముగింపు

మనస్సును జయించకుండా, ఇంద్రియాలను నిగ్రహించకుండా ఏ జీవుడు ఈ ప్రకృతి ప్రలోభాల నుంచి, కర్మ చక్రములో నుంచి బయట పడలేడు. వైరాగ్యము లేనివాడు, అభ్యాసము చేయనివాడు ఇంద్రియాలను నిగ్రహించలేడు - ప్రకృతిని దాటలేడు.

మనస్సును మింగినవాడు జ్ఞాని - మనస్సుకు లొంగిన వాడు అజ్ఞాని. స్వప్రయత్నము, కాల పరిపక్వము, ఈశ్వర కటాక్షము కలిసి రాకుండా ఏ జీవుడూ జ్ఞాని కాలేడు. జ్ఞానికి ఈ లోకమంతా ఆత్మగా, తన స్వరూపములాగే కనిపిస్తుంది - వేరు భావనే వాడికి ఉండదు. అజ్ఞానికి ఈ లోకమంతా తన కంటే వేరుగా కనిపిస్తుంది. ఈ వేరు భావనే సర్వ అనర్థాలకు మూలము. వాడికి ఈ లోకమే నిజమనిపిస్తుంది. అందుకే వాడు లోకాన్ని చూసి భ్రాంతి పడతాడు - ప్రకృతి ప్రలోభాలకు ఆశపడతాడు - ఇంద్రియాలకు లొంగిపోతాడు - క్షణిక సుఖాలకు బానిస అవుతాడు. లోపల అజ్ఞానము ఉన్నంతకాలము మానవుడు ఈ లోకాన్ని చూసి మోహపడుతూనే ఉంటాడు. మోహము

ఉన్న మనిషి కాలానికి, కామానికి లొంగి పోతాడు - వాడు పాపం చేసి తీరతాడు. చేసిన పాపమే దుఃఖ రూపము లో మనిషికి ఎదురువస్తుంది.

వివేకములేని జీవుడు అధోగతిపాలు అవుతాడు. వాడికి దరిచేరు దారే కనిపించదు. బజారులో వస్తువులుండి వాటిని కొనుక్కునే శక్తిలేని వాడిని మనము దరిద్రుడని అంటున్నాము. నిజమైన దరిద్రుడు వాడు కాదు - శాస్త్రములలో ఎంత జ్ఞానము ఉన్నప్పటికీ దానిని అర్థము చేసుకోగల బుద్ధిలేని వాడే నిజమైన దరిద్రుడు. బుద్ధిహీనుడు అజ్ఞానిగానే మిగిలి పోతాడు. విషయాన్ని అర్థము చేసుకోకుండా కేవలము మూర్ఖత్వముతోటి, మొండితనముతోటి సాధన చేసి మానవుడు మనస్సును జయించలేడు. వివేకములేని నిగ్రహము వాడికి ఆగ్రహాన్ని, అశాంతిని తీసుకువస్తుందేగాని - వాడి మనస్సు, ఇంద్రియాలు చల్లబడవు. మనస్సులో శాంతిలేనివాడు ఇంద్రియముల తో పోరాడలేడు. వివేకముతో కూడిన వైరాగ్యముతో నిరంతరము ఎవడు తన ఇంద్రియాలతో పోరాడు తుంటాడో - వాడికి ఈశ్వరానుగ్రహము వర్షిస్తుంది -

దారి కనిపిస్తుంది.

మానవ జన్మ రావటము, మోక్షము పొందాలనే కాంక్ష కలగటము, సత్పురుష సహవాసము దొరకటము ఎన్ని జన్మల సుకృత ఫలమో! పూర్వ జన్మ లందు పుణ్య బలము ఉన్నవాడికే మానవ జన్మ వస్తుంది. నిష్కామ బుద్ధితో సత్కర్మను ఆచరించిన వాడికే మోక్షము పొందాలనే కాంక్ష కలుగుతుంది. ఆ మోక్ష కాంక్షే వాడిని సత్పురుషుని పాదాల చెంతకు చేరుస్తుంది. సత్పురుష సాన్నిధ్యము దొరికినవాడు తరించి తీరతాడు. కల్ప వృక్షము, కామధేనువు కోరిన వాటినే ఇస్తాయిట! కాని సత్పురుష సహవాసము కోరని వాటిని కూడా ఇస్తుంది. సత్పురుష సాన్నిధ్యములో సాధ్యము కానిదేముంది? సత్పురుష సాన్నిధ్యాన్ని మించిన సాధనలేదు.

నిజమైన తెలివిగలవాడు ఎవడు బంధింప బడడు - ఆ తెలివి సహాయముతో బంధములో నుంచి బయటపడతాడు. తపస్సు అంటే తిండిమానుకొని, నోరుమూసుకొని కూర్చొనుటకాదు. దేహాన్ని తపింప చేసి దేహాన్ని స్వాధీనములోకి తెచ్చుకోవాలి. ఇంద్రియాల ను నియమించి ఇంద్రియాలను స్వాధీనములోనికి

తెచ్చుకోవాలి. అదే తపస్సు! నిరహంకార స్థితిని, నిర్వికార స్థితిని, నిర్విచార స్థితిని, నిష్ప్రపంచస్థితిని అందుకోవాలి - అదే సాధనల యొక్క ధ్యేయం!

సాధన చేసి తరించే అవకాశము ఒక్క మానవ జన్మకే ఉంది. మిగిలిన జీవరాశులన్నీ ఈ కాల గర్భములో కలిసిపోవలసినదే. అట్టి ఉత్కృష్టమైన మానవ జన్మనెత్తి సాధనచేసి తరించని జన్మ వ్యర్థము. మరల మానవ జన్మ వస్తుందో - రాదో! ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగము చేసుకోని జీవుణ్ణి మరల దేహం యిచ్చి శిక్షిస్తాడు దేవుడు. కాకిలా కలకాలం బ్రతికేకంటే - హంసలా క్షణకాలం బ్రతికితే చాలు - జన్మ సార్థకమౌతుంది.

దేవుడు జీవుడుకి ఇచ్చిన స్వేచ్ఛ ఒక్కటే - మిగిలిన జీవులకు లేని బుద్ధిని మనకు ప్రసాదించాడు. ఆ బుద్ధి సహాయముతో ప్రారబ్ధ ప్రవాహంలో పడి కొట్టుకు పోకుండా మనస్సును సంస్కరించుకునే స్వేచ్ఛను మనకు ఇచ్చాడు.

ఏ కర్మ నిమిత్తము మన దేహము ఈ భూమి మీదకు వచ్చినదో - ఆ పని జరిగే తీరుతుంది. దానికి


మన ప్రయత్నములతోటి, కోరికలతోటి, ఇష్టాయిష్టాల తోటి నిమిత్తము లేదు. శక్తి ఈశ్వరుడిది! ఈశ్వర సంకల్పమే ఈ సృష్టిలో జరుగుతుంది. మన కోరికలకే గనుక శక్తివుంటే మనము చనిపోకూడదని కోరుకుంటున్నా మరి ఎందుకు చనిపోతున్నాము?

మన కోరికలకు శక్తి లేదు. కనుక దేవుని సంకల్పాన్ని గౌరవించి, మన రాగ ద్వేషాలను ప్రక్కన పెట్టి, మన దేహం ద్వారా జరుగవలసిన కర్మను కర్తృత్వము లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా - ఆచరిస్తే ఆపని మన మనస్సును శుద్ధి చేస్తుంది - బంధములో నుంచి విడుదల చేస్తుంది.

దేవుడిని తెలుసుకోవటానికి - ఆ దేవుడు మనకు ప్రసాదించే శక్తినే అనుగ్రహమని అంటారు. ఆ దైవానుగ్రహము కోసము మనము చేసే ప్రయత్నమే సాధన! దైవానుగ్రహము లేకుండా ఏ జీవుడు జ్ఞాని కాలేడు. జ్ఞానికానివాడు దేవునిలో లయము కాలేడు.

దైవానుగ్రహము ఎప్పుడూ ఉంది. కాని అది మన అనుభవములోనికి రాకుండా మన ఇంద్రియాలు, మన మనస్సే మనకు అడ్డుపడు

తున్నాయి. ఇంద్రియ నిగ్రహము ఉన్న వాడికే మనో నిగ్రహము సాధ్యపడుతుంది. మనో నిగ్రహము ఉన్న వాడికే చిత్తశుద్ధి సాధ్యపడుతుంది. చిత్త శుద్ధి ఉన్న వాడికే దైవానుగ్రహము వర్షిస్తుంది. దైవానుగ్రహము ఉన్నవాడే ఆత్మను దర్శిస్తాడు. ఆత్మను దర్శించినవాడికే సమత్వము సాధ్యమౌతుంది. సమత్వమే యోగ సారము - ఇదే రమణ సందేశం!





*Designed at*

**Ananya Graphics**

**PALAKOL**


☎ 08814 - 225537, 9397151342

*Printed at*

**Sri Bhavani Offset Printers**

(Dude Srinu), SVR Complex

PALAKOL, ☎ 08814 - 228858


సత్ చిత్ ఆనంద సంగమమ్